# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి   శనివారం17-08-2024   సంపుటి : 06   సంచిక : 329   పేజీలు : 8   వెల : రూ 3-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆళ్లగడ్డ
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


## మాజీ మంత్రులు రోజా, ధర్మాన కృష్ణదాస్ ల పై కేను నమోదు

విజయవాడఆడుదాం ఆంధ్రా పేరుతో 150 కోట్ల స్కాంలో రోజాపై సి.ఐ.డి కేసు నమోదు అయింది. ఆడుదాం ఆంధ్రా పేరుతో 150 కోట్ల స్కామ్ జరిగిందని మంత్రులు రోజా, ధర్మాన కృష్ణదాస్ అక్రమాలపై విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా సీఐడీకి తెదేపా నేతలు ఫిర్యాదు చేసారు. దాంతో సిఐడి విచారణ జరిపించేందుకు సిద్ధమయింది. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కు కీలక ఆదేశాలు జారీ చేసారు. ఇక ఏ క్షణమైనా రోజా అరెస్ట్ జరగవచ్చని ప్రచారం జరుగుతోంది..

# మోగిన ఎన్నికల నగారా..

### జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల





దేశంలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. హర్యానా, జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ షెడ్యూల్ విడుదల చేశారు.జమ్మూ కశ్మీర్‌లో మొత్తం మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 90 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఇక హర్యానా అసెంబ్లీకి ఒకే దశలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. మొత్తం 90 స్థానాలకు అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. '2024 లోక్‌సభ ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ. ఆ ఎన్నికలు విజయవంతంగా, శాంతియుతంగా పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా యువత మొదలుకుని వృద్ధుల వరకు భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో అక్కడి ఓటర్లు ఎంతో చైతన్యం చూపించారు. ఈసారి వారు హింసను పక్కనపెట్టి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకే మొగ్గు చూపారు' అని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు.జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని రాజీవ్ కుమార్ తెలిపారు. 'జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో 74 జనరల్, ఎస్సీ-7, ఎస్టీ-9. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 87.09 లక్షల మంది (జులై 25 నాటికి) ఓటర్లు ఉంటారు. ఇందులో 44.46 లక్షల మంది పురుషులు కాగా, 42.62 లక్షల మంది మహిళా ఓటర్లు. ఇక 3.71 లక్షల మంది మొదటి సారి ఓటర్లు, 20.7 లక్షల మంది యువ ఓటర్లు' అని రాజీవ్ కుమార్ వివరించారు. ఓటర్ల తుది జాబితాను 19న అమర్‌నాథ్ యాత్ర ముగిన తర్వాత ఆగస్టు 20న ప్రకటించనున్నట్లు తెలిపారు.

# ఆకలితో ఉన్నవాడికి అన్నా క్యాంటీన్ ఓ వరం

- కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోపే హామీని నిలబెట్టుకున్నాం
- పేదవారిని ఎగతాళి చేసేలా వైకాపా ఎమ్మెల్యే మాట్లాడటం బాధాకరం
- మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం
- నులకపేట, మంగళగిరి పాతబస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి లోకేష్
- సామాన్యులతో కలిసి టిఫిన్ చేసిన మంత్రి





మంగళగిరిఃఅన్న క్యాంటీన్ల ఏర్పాటుతో ఆకలికి ఫుల్ స్టాప్ పెట్టింది తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం అని విద్య,ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని నులకపేట, మంగళగిరి పాతబస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రిబ్బన్ కట్ చేసి అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. అన్న క్యాంటీన్ లలో ప్రజలకు స్వయంగా ఉదయం అల్పాహారం వడ్డించిన మంత్రి నారా లోకేష్.. అన్న క్యాంటీన్ వెబ్ సైట్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టోకెన్ జారీ ప్రక్రియ, విరాళాల కోసం రూపొందించిన వెబ్ సైట్ ను పరిశీలించారు.గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. 2024 ఎన్నికల సమయంలో బాబు సూపర్-6 హామీలతో పాటు అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగానే అన్న క్యాంటీన్ల ఏర్పాటు హామీని నిలబెట్టుకున్నాం. 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. మిగతా వాటిని కూడా యుద్ధప్రాతిపదికన ప్రారంభిస్తాం. జగన్ రెడ్డి పాలనలో ఒకే ఒక్క సంతకంతో అన్న క్యాంటీన్లను మూసేశారు. దీనిపై కౌన్సిల్ లో నేను నిలదీయగా.. అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రి హామీ ఇవ్వడం జరిగింది. కానీ దాని ఊసే లేదు. ప్రశ్నిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని చెప్పారు.ప్రతిపక్షంలో ఉండగా మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం నారా లోకేష్ 4 అన్న క్యాంటీన్లను నిర్వహించారు. మంగళగిరి పట్టణం, తాడేపల్లిలోని నులకపేట, దుగ్గిరాలలోని రైలుపేట, రేవేంద్రపాడులో సొంత నిధులతో అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేశారు. రూ.2కే మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. వందలాది మంది పేద ప్రజల ఆకలి తీర్చారు. దీంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా బడుగు బలహీన వర్గాల కోసం 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సొంత నిధులతో తోపుడు బండ్లు, ప్రజల దాహార్తి తీర్చేందుకు జలధార వాటర్ ట్యాంకర్లు, వైద్యసేవలకు ఆరోగ్యరథాలు, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు కుట్టుమిషన్లు, చేనేతలకు మగ్గాలు, స్వర్ణకారులకు పనిముట్లు, వికలాంగులకు ట్రైసైకిళ్లు, పాదచారులు సేదదీరేందుకు సిమెంటు బల్లలు అందజేశారు.మంగళగిరి పాతబస్టాండ్ వద్ద ప్రారంభించిన అన్న క్యాంటీన్ లో సామాన్యులతో కలిసి మంత్రి నారా లోకేష్ టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా తనతో పాటు టిఫిన్ చేస్తున్న అజయ్ నగర్ కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు జోసఫ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంత కూలీ వస్తుందని, గతంలో రాజధాని పనులు ఉన్నప్పుడు ఎలా ఉండేదని ఆరా తీశారు. ప్రస్తుతం తనకు రోజుకు రూ.700 కూలీ వస్తుందని, భార్యా పిల్లలు ఉన్నారని జోసఫ్ తెలిపాడు. మరో నెలరోజుల్లో అమరావతి పనులు ప్రారంభమవుతాయని, అప్పుడు ఖాళీ ఉండదని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.జగన్ రెడ్డి మన పాస్ పుస్తకాలపైన, సర్వేరాళ్లపైన తన ఫోటోలు ముద్రించేందుకు రూ.700 కోట్లు ఖర్చు చేశారు. విశాఖ రుషికొండపై రూ.500 కోట్ల ఖర్చుతో విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించారు. సొంత పత్రిక సాక్షికి 50శాతం ఐ అండ్ పీఆర్ బడ్జెట్ రూ.400 కోట్లతో ప్రకటనలు ఇప్పించారు. 203 అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.200 కోట్లు ఖర్చువుతోంది. రుషికొండ ప్యాలెస్ కు పెట్టిన డబ్బులతో నిరుపేద కుటుంబాలకు రెండున్నర సంవత్సరాలు మూడు పూటలా భోజనం లభించేది. సాక్షికి ఇచ్చిన డబ్బులు ద్వారా రెండేళ్లు, సర్వే రాళ్ల ఖర్చు, పాస్ పుస్తకాల బదులు మూడేళ్లు అన్న క్యాంటీన్లు నడిపించవచ్చు. అన్న ఎన్టీఆర్ పేద ప్రజలే తమ దేవుళ్లని నినదించారు. నాడు, నేడు ఎప్పుడూ టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీలు నిరుపేద కుటుంబాల గురించే ఆలోచిస్తాయి. అందులో భాగంగనే మూసేసిన అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం.అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై వైకాపా ఎమ్మెల్యే పేదవారిని ఎగతాళి చేసేలా మాట్లాడటం బాధాకరం. మీరు చేతగానివాళ్లు. నిరుపేద కుటుంబాలకు మూడు పూటలా భోజనం పెట్టలేని అసమర్థులు. నిరుపేద కుటుంబాలను అవమానించే హక్కు మీకు ఎవరిచ్చారు? దీనిపై ఫేక్ జగన్ ఎక్కడా స్పందించరు, ఖండించలేదు. ఏ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల గురించి ఆలోచిస్తోందో, ఎవరు పెత్తందార్ల గురించి ఆలోచిస్తున్నారో ప్రజలందరూ గమనించాలి

# చంద్రబాబు నోట మళ్లీ స్వర్ణాంధ్ర పాట..



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిపై సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ఆర్థికాభివృద్ధి కోసం టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఆ టాస్క్ ఫోర్స్‌కు టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్.. కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు. 20247 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ కావాలన్న లక్ష్యంతో ఈ టాస్క్ ఫోర్స్ పని చేస్తుంది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడ్ని టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో మేధావులు, పారిశ్రామికవేత్తలతో కలిపి ఏపీ అభివృద్ధికి ఏర్పాటు చేయనున్న టాస్క్‌ఫోర్స్‌కు చంద్రశేఖరన్.. కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పడం తనకు ఆనందంగా ఉందని చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.చంద్రశేఖరన్ తనకు పాత స్నేహితుడని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీతో కలిసి పని చేసేందుకు టాటా గ్రూప్ కూడా అంగీకరించిందన్నారు. కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో అమరావతిలో 'సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ ఆన్ కాంపిటీటివ్‌నెస్' టాటా గ్రూప్ ఏర్పాటు చేస్తుందన్నారు. విశాఖపట్నంలో టీసీఎస్ అభివృద్ధి కేంద్రం ఏర్పాటు, ఎయిర్ ఇండియా, విస్తారా ద్వారా రాష్ట్రానికి ఎయిర్ కనెక్టివిటీ పెంపు తదితర అవకాశాలపై చంద్రశేఖరన్‌తో చర్చించినట్లు చంద్రబాబు చెప్పారు. ఈ భేటీలో ఏపీ మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ తోపాటు టాటా గ్రూప్ టాప్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు.

# విశాఖ ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవంగా ఎన్నిక



అమరావతి : విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక లో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల అధికారులు అధికారికంగా బొత్స ఎన్నికను ప్రకటించారు. ఆయన మూడేళ్లపాటు ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. విశాఖ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు సర్టిఫికెట్ తీసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బీ ఫారం ఇచ్చి పోటీకి ప్రోత్సహించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు , సహకరించిన వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీ నుంచి కూటమి ప్రభుత్వం తప్పుకోవడంతో రంగంలో మొత్తం ఇద్దరే నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా షఫీ ఉల్లా నామినేషన్ నామినేషన్ వేశారు. బుధవారం స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో బొత్స ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికకు ముందు వైసీపీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రాజీనామా చేసి జనసేనలో చేరడంతో అయితే పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ అధిష్టానం అప్పటి మండలి చైర్మన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. వాటిని పలు దఫాలుగా పరిశీలించి చివరకు ఎమ్మెల్సీపై అనర్హత వేటు వేశారు. దీంతో ఖాళీ అయిన విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు.ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీకి 600 మంది ఎంపీటీసీ, జడ్పీటీసీలు, కార్పొరేటర్ల సంఖ్యాబలం ఉంది. కూటమికి 200 పైగా మాత్రమే సభ్యులున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన కూటమి ప్రభుత్వం చివరకు హుందాగా రాజకీయాలు చేద్దామని, ఎవరిని ప్రలోభ పెట్ట వద్దని సూచిస్తూ ఎన్నికల్లో? పోటీ వద్దంటూ చంద్రబాబు స్పష్టం చేయడంతో కూటమి బరిలో నిలువ లేదు.

# ఎస్ఎస్ఎల్వీ -డీ 3 ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చేపట్టిన మరో ప్రయోగం విజయవంతమైంది. శుక్రవారం ఉదయం నెల్లూరు జిల్లా శ్రీహరికోట షార్ నుంచి ఎస్ఎస్ఎల్వీ -డీ 3 రాకెట్‌ను నింగిలోకి పంపింది. షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.చిన్న చిన్న శాటిలైట్లను అభివృద్ధి చేయటం, అందుకు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించే లక్ష్యంలో భాగంగా ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ఈవోఎస్-08ను తక్కువ ఎత్తులోని భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఈ మిషన్ లక్ష్యం. దాదాపు 6 నెలల తర్వాత ఇస్రో చేపడుతున్న రాకెట్ ప్రయోగమిది. కేవలం రెండు రోజుల ప్రణాళికతో చిన్న చిన్న శాటిలైట్స్‌ను తక్కువ ఖర్చుతో భూ కక్ష్యలోకి చేర్చేందుకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్‌తో సాధ్యమవుతుందని ఇస్రో మాజీ సైంటిస్టు ఒకరు చెప్పారు.ఈ ప్రయోగం ద్వారా 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, పర్యవేక్షిం చనుంది. ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ (ఈవోఐఆర్) పెలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యప్చర్ చేస్తుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుందని ఇస్రో పేర్కొంది.



# రాష్ట్రంలో ఐదు రోజులు భారీ వర్షాలు..

హైదరాబాద్, ఆగస్టు 16 , బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్ర, శనివారాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. గంటకు 30-40కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.ఇవాళ నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం నాడు వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.సోమవారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, , మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# సంపాదకీయం

శనివారం17-08-2024

## బంగ్లాదేశ్‌లోనూ ఉక్రెయిన్ తరహా పరిస్థితులు

బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు చూస్తుంటే.. పదేళ్ల క్రితం ఉక్రెయిన్‌లో జరిగిన పరిణామాలు గుర్తుకొస్తున్నాయి. అప్పటి వరకు మిత్రరాజ్యాలుగా ఉన్న దేశాలే ఒక్కసారిగా శత్రువులుగా మారిపోయిన పరిస్థితి ఉక్రెయిన్ ? రష్యా మధ్య చోటుచేసుకోగా.. ఇప్పుడు బంగ్లాదేశ్-భారత్ మధ్య సంబంధాలు సైతం అదే మాదిరిగా మారాయి. సరిగ్గా పదేళ్ల క్రితం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో పెద్ద ఎత్తున ప్రజాందోళన చెలరేగింది. నిరసనకారులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఇందులో కొందరు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు మరింత ఉధృతంగా విరుచుకుపడ్డారు. ఫలితంగా నాటి ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యంకోవిచ్ గద్దె దిగాల్సి వచ్చింది. అంతేకాదు, తన ప్రాణాలు కాపాడుకోడానికి రష్యాలో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. విక్టర్ యంకోవిచ్ రష్యా అనుకూల వైఖరిని అవలంబించారు. యురోపియన్ యూనియన్, నాటో లో ఉక్రెయిన్ చేరాలన్న ప్రతిపాదనలను ఆయన వ్యతిరేకించారు. ఈ క్రమంలో యంకోవిచ్‌ను ఆ పదవి నుంచి తప్పించడం కోసం అగ్రరాజ్యం అమెరికానే కుట్ర చేసిందని అప్పట్లో అనేక కథనాలు, విశ్లేషణలు వచ్చాయి. ఉక్రెయిన్ ప్రజాందోళన వెనుక అమెరికా మద్దతు ఉందన్న విషయాన్ని ఆ దేశానికి డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా పనిచేసిన విక్టోరియా నులాండ్ స్వయానా అంగీకరించారు. ఉక్రెయిన్ ప్రజాందోళనలు కేవలం అధ్యక్షుణ్ణి గద్దె దించడం, ప్రభుత్వాన్ని పడగొట్టడం వరకే పరిమితం కాలేదు. అంతటితో ఉద్యమం ముగియలేదు. ఉక్రెయిన్‌లో రష్యన్ భాష ఎక్కువగా మాట్లాడే క్రిమియా, డాన్‌బాస్ ప్రాంతాల్లో ఆందోళనలు దారితప్పాయి. రష్యన్ భాష మాట్లాడే ప్రజలను నిరసనకారులు లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. ఈ పరిస్థితుల్లో రష్యన్ భాష మాట్లాడే ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉన్న క్రిమియాను రష్యా ఆక్రమించుకుని, తమ భూభాగంలో కలుపుకుంది. ఆనాడు రగులుకున్న నిప్పు.. దశాబ్దకాలంగా కొనసాగుతూ 2022లో రెండు దేశాల మధ్య యుద్ధానికి దారితీసింది. తీరా ఇంతజరిగినా ఇప్పటికీ ఉక్రెయిన్ యురోపియన్ యూనియన్‌లో, నాటో (ఔయిూ)లో సభ్యత్వం పొందలేకపోయింది. మొత్తంగా ఒకనాటి సోవియట్ యూనియన్‌లో భాగంగా ఉన్న ఉక్రెయిన్, రష్యా ప్రభావం నుంచి బయటపడాలన్న ఆలోచనతో మొదలైన ప్రజా ఉద్యమంచి వరకు ఆ దేశాన్ని అమెరికా కబంధ హస్తాల్లోకి నెట్టేసింది. పేరుకు ఉక్రెయిన్ ? రష్యా యుద్ధంలా కనిపిస్తున్నప్పటికీ.. అది అమెరికా ? రష్యా మధ్య జరుగుతున్న యుద్ధమని, మధ్యలో ఉక్రెయిన్ బలి పశువుగా మారిందని ప్రపంచ పరిణామాల గురించి అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ అర్థమవుతోంది. సరిగ్గా ఉక్రెయిన్ తరహాలో పదేళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో దేశాధినేతను గద్దె దించడమే లక్ష్యంగా ప్రజా ఉద్యమం ఎగిసిపడింది. 2024 జూన్ నెలలో మొదలైన ఉద్యమం, జులై నాటికి తీవ్రరూపం దాల్చి హింసాత్మకంగా మారింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన ఈ ఆందోళనల్లో పలువురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో నిరసనకారులు మరింత రెచ్చిపోయారు. ఆగస్ట్ నాటికి ఆ ఆందోళనలు దేశ ప్రధాని షేక్ హసీనా నివాసాన్ని ముట్టడించే వరకు చేరుకున్నాయి. విధిలేని పరిస్థితుల్లో హసీనా దేశాన్ని విడిచి తాత్కాలికంగా భారత్‌లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. ఉక్రెయిన్ మాదిరిగానే ప్రజాందోళనలు దేశాధినేతను గద్దె దించాయి. సోవియట్ యూనియన్‌లో భాగంగా ఉండి, విడిపోయి స్వతంత్ర రాజ్యంగా ఉన్న ఉక్రెయిన్ తమ మాతృదేశం లాంటి రష్యాతో కయ్యం పెట్టుకోగా.. ఇప్పుడు ఒకనాటి బ్రిటీష్ ఇండియాలో భాగంగా భారత్‌లో అంతర్భాగంగా ఉండి, 1947లో విడిపోయి ఈస్ట్ పాకిస్తాన్‌గా, ఆ తర్వాత భారత్ చొరవతో స్వతంత్ర దేశంగా అవతరించిన బంగ్లాదేశ్‌లో కూడా భారత్ వ్యతిరేక భావజాలమే ప్రస్తుతం కనిపిస్తోంది. నిరసనకారులు షేక్ హసీనాను 'భారత ఏజెంట్' అని నిందించడమే కాదు, భారత్ అనుకూల వైఖరిని తప్పుబట్టారు. ఇక్కడ కూడా ప్రజాందోళనలు హసీనాను గద్దె దించడంతో శాంతించలేదు. భారత్ అనుకూల వైఖరితో ఉండే మైనారిటీ వర్గాలైన హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులకు, హింసకు పాల్పడుతున్నారు. అయితే ఈ ఆందోళనల వెనుక కూడా అమెరికా హస్తం ఉందన్నది షేక్ హసీనా ఆరోపణ. బంగ్లాదేశ్‌లోని సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని తమ సైనిక అవసరాల కోసం ఇవ్వాల్సిందిగా అమెరికా అడిగిందని, అందుకు తాను అంగీకరించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని హసీనా వెల్లడించారు. భారత వ్యతిరేక వైఖరితో ఉన్న నిరసనకారులు.. షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంగ్లాదేశ్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఈ రెండు దేశాల మధ్య కొనసాగిన సత్సంబంధాలు, మైత్రిని ప్రశ్నార్థకంలో పడేసేలా ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ వైఖరి కనిపిస్తోంది. ఆ దేశంలో భారత్ వస్తువులను బహిష్కరిస్తున్నారు. భారతీయులపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. గతంలో హిందీ భాష వాడకంపై బంగ్లాదేశ్‌లో వ్యతిరేకత వ్యక్తమైంది. హిందీ భాషను ఉపయోగించడాన్ని నిరసనకారులు బంగ్లాదేశ్‌కే అవమానకరమని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఏజెంట్లను అరెస్టు చేయడమే ఇందుకు నిదర్శనం. మొత్తంగా బంగ్లాదేశ్ సర్వసత్తాక స్వతంత్ర రాజ్యంగా అవతరించడానికి సహకరించిన భారతదేశంపై కృతజ్ఞతాభావం ఉండాల్సిన చోట బంగ్లాదేశ్ కొత్త తరాన్ని భారత్ పట్ల విషాన్ని నింపుతోంది. యువతను రెచ్చగొడుతోంది. ే చేసుకున్న భారత్‌కు ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిణామాలు ఆందోళన కల్గిస్తున్నాయి. కొత్త ప్రభుత్వంతో కూడా సత్సంబంధాలు కొనసాగించాలన్న భారత్ ప్రయత్నాలకు ఇవన్నీ అడ్డంకిగా మారాయి.

## ఈ వీకెండ్‌లో వరుస సెలవులు..

## తెలుగు రాష్ట్రాల మధ్య 8 ప్రత్యేక రైళ్లు

ఈ వారాంతంలో వరుస సెలవుల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తెలుగు రాష్ట్రాల మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. నర్సాపుర్-సికింద్రాబాద్, కాకినాడ పట్టణం-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి మధ్య మొత్తం ఎనిమిది రైళ్లను ఏర్పాటు చేసింది. నర్సాపురం-సికింద్రాబాద్ (07175) రైలు ఆగస్టు 18న (ఆదివారం) నర్సాపుర్‌లో బయల్దేరి మరుసటి రోజు ఉదయాన్నే 5 గంటలకు సికింద్రాబాద్ చేరుకోనుంది. అలాగే సికింద్రాబాద్-నర్సాపుర్ (07176) రైలు ఆగస్టు 19న (సోమవారం) సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు నర్సాపుర్ చేరుకోనుంది. కాకినాడ టౌన్-సికింద్రాబాద్ (07177) రైలు ఆగస్టు 17, 19 తేదీల్లో రాత్రి 9 గంటలకు కాకినాడలో బయల్దేరి ఆ మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు కాకినాడ



పట్టణానికి చేరుకుంటుంది. అలాగే ఈనెల 18, 20 తేదీల్లో సికింద్రాబాద్‌లో సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరనున్న సికింద్రాబాద్-కాకినాడ టౌన్ (07178) రైలు ఆగస్టు 19, 21 తేదీల్లో ఉదయాన్నే 6.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకోనుంది. కాచిగూడ-తిరుపతి (07455) రైలు ఆగస్టు 16న రాత్రి 10.30 గంటలకు కాచిగూడలో బయల్దేరి ఆగస్టు 17న (శనివారం) ఉదయం 10.25 గంటలకు తిరుపతి చేరుకోనుంది. అలాగే తిరుపతి- కాచిగూడ (07456) రైలు ఆగస్టు 17న తిరుపతిలో రాత్రి 7.50 గంటలకు బయల్దేరి.. మరుసటి రోజు (ఆదివారం) ఉదయం 9.30గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది. కాచిగూడ టౌన్-సికింద్రాబాద్ రైలు ఆగస్టు 18న సాయంత్రం 6.30 గంటలకు కాకినాడలో బయల్దేరి మరుసటి రోజు ఉదయాన్నే 6 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకోనుంది. ఇకపోతే 07188 నంబర్ కలిగిన రైలు సికింద్రాబాద్‌లో ఆగస్టు 19న రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటి రోజు (మంగళవారం) ఉదయం 8 గంటలకు కాకినాడ పట్టణానికి చేరుకుంటుంది.

## మమతా బెనర్జీ తక్షణమే రాజీనామా చేయాలి : చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్

కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని సిలిగురి ఎమ్మెల్యే, రాష్ట్ర అసెంబ్లీ చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్ డిమాండ్ చేశారు. బెంగాల్‌లో మహిళలపై లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కందుని, పార్క్ స్ట్రీట్, మతిగర, చోప్రా, అరియదహ, కలియాగంజ్, హంస్‌ఖలి సహా పలు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు ఆందోళన రేకెత్తిస్తున్నాయని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని నడవడంలో విఫలమయ్యారని వెల్లడవుతున్నదని చెప్పారు. ఆర్జీ కార్ ఘటన అనంతరం ఘటనా స్థలం మీడియా కంటపడకుండా సీఎం ప్రయత్నించారని ఆరోపించారు. మహిళలపై తీవ్ర నేరాలు పెచ్చుమీరుతున్నాయని, దీదీ సర్కార్




హయాంలో మహిళలకు భద్రత కరవైందని వ్యాఖ్యానించారు. నిందితులను పట్టుకున్నా వారిని కఠినంగా శిక్షించడం లేదని ఆరోపించారు. ఇక కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో వైద్యురాలి హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా సిలిగురిలో బీజేపీ నేతలు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు.

## ఎంవీఏ సీఎం అభ్యర్థిని ప్రకటించాలి : ఉద్ధవ్ ఠాక్రే


న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరిలో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష మహా వికాస్ అఘాది (ఎంవీఏ) సన్నద్ధమవుతున్నది. ఏక్‌నాథ్ షిండే సర్కార్‌పై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకుని అధికారంలోకి రావాలని పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు సీఎం అభ్యర్థిని ప్రకటించి ఆపై ప్రచారానికి శ్రీకారం




చుట్టాలని శివసేన (ఐబి) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే విపక్ష కూటమికి పిలుపు ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీ ప్రకటించే సీఎం అభ్యర్థికి తమ పార్టీ భేషరతుగా మద్దతు ఇస్తుందని ఠాక్రే స్పష్టం చేశారు. ఎంవీఏ సమావేశంలో ఠాక్రే ఈ విషయాన్ని నొక్కిచెప్పారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఈ ఎన్నికల్లో ఎంవీఏ పోరాడుతుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఎంవీఏ సీఎం అభ్యర్థిని ప్రకటించాలని, పృథ్వీరాజ్ ఛవాన్ లేదా శరద్ పవార్ సీఎం పదవికి వారి ప్రతిపాదనను ప్రకటిస్తే వారికి తాము భేషరతుగా మద్దతిస్తామని ఠాక్రే స్పష్టం చేశారు. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీ నుంచి సీఎం అభ్యర్థిని ప్రకటించాలనే పద్ధతిని గతం నుంచి అనుసరించడం జరుగుతున్నదని చెప్పారు. గత కూటముల్లోనూ తాము ఇదే ఫార్ములా అనుసరించామని గుర్తుచేశారు. పార్టీ గుర్తును ఏక్‌నాథ్ షిండే శివసేన దక్కించుకోవడంపై ఠాక్రే స్పందిస్తూ వారు నా 'విల్లుబాణం' చిహ్నాన్ని దొంగిలించినా, నేను వారి వెన్నులో మంట పెట్టడానికి 'లైటింగ్ టార్చ్'ని గుర్తుగా తీసుకున్నానని చెప్పారు.

## పీజీఆర్ఆర్‌సీడీఈలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16 : ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు




పీజీఆర్ఆర్‌సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సులకు ప్రతి ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మొదటి దఫా శుక్రవారం నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. వివిధ పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు తమ వెబ్‌సైట్ లిలిలి.నీబీఇటవ.నివబిలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అందులో లాగిన్ అయి దరఖాస్తు ఫారం నింపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు, కోర్సు ఫీజు, పరీక్షా ఫీజులను ఆన్‌లైన్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## నా కొడుకు అమాయకుడు.. అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు : మాజీ మంత్రి జోగి రమేశ్



అమరావతి : రాజకీయాల్లో విశ్వసనీయత ఎంతో అవసరమని , ఎవరికి కూడా అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలని మాజీ మంత్రి జోగి రమేశ్ సూచించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. అగ్రిగోల్డ్ భూములను అక్రమంగా కొనుగోలు చేయలేదని, కావాలంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, సత్యప్రసాద్ వద్దకు వెళ్లి స్వయంగా తానే వివరిస్తానని పేర్కొన్నారు. కక్ష ఉంటే నాపై తీర్చుకోవాలని, అమాయకుడైన నా కొడుకుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దారుణమని ఆరోపించారు. వైఎస్ జగన్‌పై టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడంతో నిరసన తెలిపేందుకు వెళితే నాపై దాడి చేసి, మళ్లీ నా మీదనే కేసు పెట్టారని వెల్లడించారు. రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడే చంద్రబాబు కు, కూటమి నేతలకు విలువ లేదని దుయ్యబట్టారు. ఏపీ ప్రజలు కూటమికి అసెంబ్లీలో భారీ మెజారిటీ ఇచ్చారని, ఇచ్చిన సమయాన్ని ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వినయోగించుకోవాలని సూచించారు. అభం, శుభం తెలియని నా కొడుకుపై అక్రమ కేసులు పెట్టడం సరైనది కాదని అన్నారు. రేపు మళ్లీ అధికారంలోకి వస్తామన్న విషయాన్ని గుర్తించాలని తెలిపారు.

## బాలిక అబార్షన్ కేసులో వైద్యశాఖ సీరియస్.. శ్రీ శ్రీనివాస క్లినిక్ సీజ్



హైదరాబాద్ : గిరిజన బాలిక అబార్షన్ కేసునువైద్యశాఖ సీరియస్‌గా తీసుకుంది. అబార్షన్ చేసిన క్లినిన్‌ను సీజ్ చేసింది. వివరాల్లోకి వెళ్తే..రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలో ఉన్న శ్రీ శ్రీనివాస క్లినిక్‌ను శుక్రవారం మధ్యాహ్నం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. 13 ఏళ్ల గిరిజన మైనర్ బాలిక గర్భం దాల్చిన ఘటనలో అబార్షన్ చేసిన క్లినిక్ వైద్యుడు డాక్టర్ రంజిత్ వ్యవహారంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్లినిక్ ను సీజ్ చేశారు. కాసేపటి క్రితం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం ఈ ఘటనపై స్పందించారు. సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే విధంగా ఉన్న మైనర్ అబార్షన్ సంఘటనపై రాష్ట్రవ్యాప్తంగా సంచ లనం రేకెత్తించిన విషయం విధితమే. అయితే గత మూడు రోజులుగా మీడియాలో ఈ ఘటనపై తీవ్ర దుమా రం రేగుతుంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆలస్యంగా స్పందించినప్పటికి చర్యల నిమిత్తం సీజ్ చేసిన ట్టు తెలిపారు. కాగా, ఆయుర్వేదిక్ డాక్టర్‌గా అనుమతి తీసుకున్న రంజిత్ అల్లోపతి వైద్యం చేస్తున్నారు. అలాగే శ్రీలక్ష్మి మెడికల్ హాల్ పేరిట లోపల శ్రీ శ్రీనివాస క్లినిక్ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధం. మరి ఇన్ని రోజులు అధికారులు అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనున్న భారత్ : ఐఎంఎఫ్

: భారత్ వృద్ధి రేటు ఆశించిన దాని కన్నా మెరుగ్గా ఉందని, 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గీతా గోపీనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ అంచనాలకు మించి వృద్ధి రేటు నమోదు చేసిందని అన్నారు. ప్రైవేట్ వినిమయం కూడా పుంజుకుంటున్నదని పేర్కొన్నారు. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి రేటు అంచనాను 7 శాతంగా ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వం అంచనాలు 6.5 శాతం కంటే ఐఎంఎఫ్ వృద్ధి రేటు అంచనా అధికం కావడం గమనార్హం. 2027 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత ఏడాది ప్రైవేట్ వినిమయ వృద్ధి 4 శాతం కాగా, గ్రామీణ వినిమయంలో పెరుగుదలతో ఈ ఏడాది ప్రైవేట్ వినిమయం మెరుగవుతుందని అంచనా వేస్తున్నామని గీతా గోపీనాథ్ పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు వివరాలు వెల్లడించారు. ద్విచక్ర వాహన విక్రయాలు, కన్జూమర్ గూడ్స్ విక్రయాలు ఊపందుకోవడం గమనించవచ్చని చెప్పారు. రుతుపవనాలు సానుకూలంగా ఉండటంతో పంటల దిగుబడులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. వ్యవసాయ ఆదాయాలు పెరిగితే గ్రామీణ వినిమయం ఊపందుకుంటుందని చెప్పారు. ఈ కారణాలతో తాము భారత వృద్ధి రేటును అప్‌గ్రేడ్ చేశామని గీతా గోపీనాథ్ వివరించారు.



# దామచర్ల చక్రం తిప్పేశారు

ఒంగోలు, ఆగస్టు 16 ప్రకాశం జిల్లా ఒంగోలు రాజకీయం ఎప్పుడూ ప్రత్యేకంగానే ఉంటుంది. 2019 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల వరకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలులో చక్రం తిప్పితే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒంగోలు పాలిటిక్స్ మెత్తం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఒంటిచేతితో నడిపిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌ని వైసీపీ సొంతం చెసుకుంది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వైసిపి కార్పొరేటర్లు పసుపు కండువ కప్పుకోవడానికి క్యూ కడుతున్నారుఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్లో మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ తరపున ఆరుగురు, జనసేన నుంచి ఒకరు గెలుపొందారు. ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు విజయం సాధించారు. మిగిలిన 41 డివిజన్లలో వైసీపీ పాగా వేసింది.. అప్పట్లో స్వతంత్రంగా గెలిచిన ఇద్దరు కార్పొరేటర్లు వైసీపీలో చేరారు. దీంతో కార్పొరేషన్లో వైసీపీ బలం 43కి చేరింది. అయితే ఎన్నికలకు ముందే అయిదుగురు అధికారపక్షం కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఇక ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ వారు కూటమిలో చేరడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉన్న కార్పొరేషన్లో ఇప్పుడు కూటమి బలం 12కు చేరింది ? మరో 14 మందిని చేర్చుకుంటే మేయర్ పదవి టీడీపీ వశం అవుతుంది. అయితే వైసీపీని కోలుకోకుండా దెబ్బ కొట్టాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పావులు కదుపుతూ వచ్చారు. కనీసం మరో 20 కార్పొరేటర్లను లాక్కుంటే కౌన్సిల్‌లో ఎదురుండదని దామచర్ల స్కెచ్ గీశారు. ఆ క్రమంలో తాజాగా మేయర్ సుజాతతో పాటు 12 మంది కార్పొరేటర్లు వైసీపీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో పసుపు కండువాలు కప్పుకుని టీడీపీలో చేరిపోయారు.ఒంగోలులో మాజీ మంత్రి బాలినేని ఓడిపోవడం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అప్పటి నుంచే మేయర్ సుజాత టీడీపీతో టచ్‌లోకి వచ్చారన్న ప్రచారం జరిగింది. ఎమ్మెల్యే దామచర్లతో మంతనాలు సాగించిన ఆమె.. ఎప్పుడు పిలుపు వస్తుందా అని ఎదురు చూస్తూ వచ్చారు. ఇప్పుడు కూటమి పెద్దల నుంచి గ్రీన్ సిగ్నెల్ రావడంతో దామచర్ల ఆమెతో పాటు కార్పొరేటర్లను పార్టీలోకి ఆహ్వానించారు. చేరిక సందర్భంగా మేయర్ అందరిలాగే అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నామని స్టేట్ మెంట్ ఇచ్చేశారు.ఇప్పటికే పలు సార్లు మేయర్ సుజాత ఎమ్మెల్యే దామచర్ల జనర్ధన్‌తో టీడీపీలో చేరికపై చర్చించారు. అయితే దామచర్ల మెదట కార్పొరేటర్లను జాయిన్ చేసుకుని తర్వాత మేయర్‌ను చేర్చుకుంటామన చెప్పినట్లు ప్రచారం జరిగింది. అయితే ఆమెను మేయర్‌గా కొనసాగించేందుకు టీడీపీ నేతలు సుముఖంగా లేరని అందుకే ముందుగా కార్పొరేటర్లను చేర్చుకుని మెజార్టీ సాధిస్తే.. ఆమెను మేయర్ పీఠం నుంచి దించి. పార్టీ వారికి ఆ పదవి కట్టబెట్టు కోవచ్చని భావించారంట. తీరా చూస్తే మున్సిపల్ చట్టం ఉన్న లొసుగులు సుజాతను పదవి నుంచి దించడానికి సహకరించకపోవడంతో.. దామచర్ల ఆమెను పార్టీలో సాదరంగా ఆహ్వానించారంటున్నారు.వాస్తవానికి ఒంగోలు కార్పొరేషన్ ఎన్నికలు జరిగి మూడేళు దాటింది. కౌన్సిల్ ఏర్పడి 2024 మార్చి 14 నాటికి మూడు సంవత్సరాలు పూర్తయింది. 2014లో టీడీపీ కూటమి అధికార పగ్గాలు చేపట్టినప్పుడు మున్సిపల్ చట్టంలో మార్పులు చేసింది ? అప్పటికి పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో చైర్ పర్సన్, మేయర్‌లపై ఎన్నికలు జరిగిన నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టకూడదని చట్టం చేసింది. దాన్ని మూడు సంవత్సరాలకు కుదిస్తూ చట్టం మార్చాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరిగింది. అదే జరిగితే రాష్ట్రంలోని చాలా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు కూటమి వశం అయ్యే అవకాశం ఉండేది. అయితే అలా చట్టాన్ని మారిస్తే విమర్శలు మూటగట్టుకోవాల్సి వస్తుందని ప్రభుత్వ పెద్దలు పునరాలోచనలో పడినట్లు కనిపిస్తున్నారు.ఏదైతేనేం ఒంగోలు కౌన్సిన్లో వైసీపీకీ షాక్ ఇస్తూ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చేశారు. ప్రభుత్వ పెద్దల నిర్ణయం వెలువడే వరకు సుజాత టీడీపీ మేయర్‌గానే సీట్లో కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఈ పార్టీ మర్పులు చేర్పులు వ్యవహారం ఒంగోలు తమ్ముళ్లకు మింగుడుపడటం లేదంట . వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అనుచరులుగా పని చేసి, తమతో కయ్యానికి కాలు దువ్విన వారు ఇప్పుడు తమ పార్టీలోకి వస్తుండటంతో టీడీపీ శ్రేణులకు మైండ్ బ్లాక్ అవుతోందంట.వైసిపి అధికారంలో ఉన్నప్పుడు టీ స్టాళ్ల దగ్గర నుంచి.. అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు వరకు ఆ పార్టీ నేతలు వసూళ్ల దందా నడిపించారంట. ఒక మాటలో చెప్పాలంటే వైసిపి అభ్యర్థి బాలినేని ఓటమికి వైసీపీ కార్పొరేటర్లే ప్రధాన కారణం అన్న ప్రచారం ఉంది. అలాంటి వాళ్లను ఇప్పుడు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనర్ధన్.. రెడ్ కార్పెట్ వేసి టీడీపీలోకి ఆహ్వానించడాన్ని ఒంగోలు టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి.. టీడీపీ కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టిన వైసిపి కార్పొరేటర్లు. ఇప్పుడు అధికారాన్ని ఎంజాయ్ చేయటానికి వస్తున్నారని టీడీపీ కార్యకర్తలు మండిపడుతున్నారు.ఇటీవల 50 డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు టీడీపీ లోకి జాయిన్ అయినప్పుడు స్థానిక టీడీపీ నేతాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పార్టీ టీడీపీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.ఇప్పుడు చూస్తే మేయర్ సుజాత సహా, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జిలతో కలిపి 12 మంది కార్పొరేటర్లు తెలుగుదేశం కండువాలు కప్పేసుకున్నారు. మరిప్పుడు ఒంగోలు కార్పొరేషన్ పాలిటిక్స్ ఏ టర్న్ తీసుకుంటాయో చూడాలి.

# ఆకాశాన్నంటిన పూల ధరలు

### ఇతర రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతులు

కోనసీమ,అదిరిపోయే వివాహాది శుభముహూర్తాలు.. మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే శ్రావణ శుక్రవారం వ్రతాలు.. దేశవ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించే స్వతంత్ర దినోత్సవ వేడుకలు. ఇవన్నీ ఒకేసారి వస్తే పువ్వులకు ఉండే డిమాండ్ మాటల్లో చెప్పలేము. ప్రస్తుతం అదే జరిగింది. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక అంతర్రాష్ట్ర పూల మార్కెట్ అమ్మకం, కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. అదేవిధంగా కోనసీమ జిల్లాలో రావులపాలెం ఆత్రేయపురం ఆలమూరు కొత్తపేట ప్రాంతాల్లో పూల సాగు అధికంగా ఉంటుంది .ప్రస్తుత సీజన్లో పూల దిగుబడులు అంతగా ఉండవు. ఇటీవల వచ్చిన వరదలకు కూడా పూల తోటలో దెబ్బతిన్నాయి. అందుకనే కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఉండే బంతి, చామంతి, గులాబీ వంటి రకాలను టన్నులు కొలది ఈ మార్కెట్ కు దిగుమతి చేసుకున్నారు. అలాగే వివాహాది శుభకార్యాలకు కావలసిన డెకరేషన్ పువ్వులను బెంగళూరు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఈ మార్కెట్ కు తీసుకువచ్చారు. గురువారం స్వతంత్ర దినోత్సవ



వేడుకలతో పాటు బలమైన వివాహ ముహూర్తం ఉండడంతో ఈ పూలకు ఎక్కడలేని డిమాండ్ వచ్చింది. అంతేగాక శ్రావణ శుక్రవారంకు అవసరమైన పూల కొనుగోలుకు కూడా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల నుంచి కొనుగోలుదారులు వచ్చి పూలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు. అలాగె ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి కొనుగోలుకు వ్యాపారంలో తరలివచ్చారు. అంతేగాక ఆర్డర్లపై స్థానిక పూల వ్యాపారులు ఆర్టీసీ బస్సులు ద్వారా ఎగుమతులు చేపట్టారు.ఇటీవల వచ్చిన వరదలు వల్ల కడియం, ఆలమూరు,ఆత్రేయపురం మండలాలలో లంక ప్రాంతాల్లో సాగయ్యే కనకాంబరం, లిల్లీ, మల్లి, జాజులు, గులాబీ వంటి పూల పంటలకు నష్టం వాటిల్లింది. అందువల్ల ప్రస్తుత సీజన్లో వాటి ధరలు మరింత అధికమయ్యాయి. బుధవారం కడియపులంక పూల మార్కెట్లో పూల ధరలు ఈ విధంగా ఉన్నాయి.గురువారం ఉదయం నుంచి అదే ధరలు పలుకుతున్నాయి. చామంతి కేజీ రూ.250, వైట్ చామంతి రూ.300,బంతి రూ.50 నుంచి 80, కనకాంబరాల బారు రూ. 300 నుంచి 450, గులాబీ రూ.180, జాజులు రూ.1200, లిల్లీ రూ. 500, మల్లి రూ. 1500,హైబ్రిడ్ గులాబీ కట్ట రూ.250 పలికాయి.

# బొత్స ఎమ్మెల్సీ...

## చంద్రబాబు ట్రాప్ లో జగన్

విజయనగరం, ఆగస్టు 16 జగన్ అనుకున్నది ఒక్కటి? జరిగింది మరొకటా? విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్ ఒక వ్యూహంతో అడుగులు వేస్తే.. చంద్రబాబు మరో వ్యూహంతో తిప్పి కొట్టారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.విశ్లేషకులు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థిని పెట్టలేదు. దీంతో వైసిపి నేత బొత్స ఎమ్మెల్సీ ఎంపిక దాదాపు ఖాయమే. ప్రతిపక్షంలో ఉండగా వైసిపి ఏకగ్రీవంగా ఈ ఎమ్మెల్సీని దక్కించుకుంది. రెండు నెలల కిందటి అంతులేని మెజారిటీతో గెలిచిన కూటమి పోటీలో పెట్టేందుకు సాహసించలేకపోయింది. స్పష్టమైన బలం ఉన్నట్లు వైసీపీ చెబుతోంది. కానీ ఎన్నికలకు ముందు, తరువాత వైసీపీని చాలామంది స్థానిక ప్రజాప్రతినిధులు వీడారు. టిడిపి కూటమి పార్టీల్లో చేరారు. మరికొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. దాదాపు వైసీపీ బలం సగానికి పడిపోయింది. టిడిపి కూటమికి మెజారిటీ మార్కు దాటే అవకాశం ఉంది. అయినా సరే అభ్యర్థిని దించేందుకు చంద్రబాబు వెనక్కి తగ్గాలంటే ఏదో ఒక వ్యూహం ఉందన్నది విశ్లేషకులు అభిప్రాయం. ఎన్నికల ఫలితాల అనంతరం బొత్స సైలెంట్ అయ్యారు. ఆయన టిడిపిలో చేరతారని కూడా ప్రచారం జరిగింది. అందుకు సంబంధించి ప్రాథమిక స్థాయిలో చర్చలు కూడా జరిగినట్లు టాక్ నడిచింది. అయితే దానికి నేరుగా బొత్స ఖండన ఇవ్వలేదు. ఎన్నికల రాజకీయాల్లో లేకపోవడంతో ఎవ్వరు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. అయితే ఇప్పుడు విశాఖ ఎమ్మెల్సీ ఎన్నిక రావడంతో బొత్స తెరపైకి వచ్చారు. ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేస్తూ జగన్ ప్రకటన చేశారు. కనీసం విశాఖ జిల్లా నేతలను సంప్రదించకుండా జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బొత్స సైతం అయిష్టంగానే ఒప్పుకున్నట్లు ప్రచారం జరిగింది.వైసీపీలో ఉన్న సీనియర్ నేతలలో బొత్స పట్టున్న నేత. విజయనగరం తో పాటు ఉత్తరాంధ్ర పై ప్రభావం చూపగలరు. ఆయన కోసం కాంగ్రెస్ తో పాటు బిజెపి ప్రయత్నాలు చేస్తోందన్న వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే వైసీపీకి భారీ డ్యామేజ్ తప్పదు. అందుకే బొత్సను వ్యూహాత్మకంగా ఇరుకున పెట్టాలని జగన్ భావించినట్లు సమాచారం. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించినట్లు తెలుస్తోంది. కూటమి దూకుడు మీద ఉన్న దృష్ట్యా తప్పకుండా అభ్యర్థిని పెడుతుందని.. ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని.. ఎలాగైనా గెలవాలని చూస్తుందని జగన్ అంచనా వేశారు. పార్టీకి ఓటమి ఎదురైనా పోరాడం అన్న సంతృప్తి.. బలం లేకున్నా టిడిపి అభ్యర్థిని నిలబెట్టిందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జగన్ భావించారు. జగన్ ఒకటి తలిస్తే.. చంద్రబాబు మరోలా వ్యూహం వేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్ అసెంబ్లీకి వచ్చే అవకాశం లేదు. మండలిలో శాసనసభ పక్ష నేతగా లేళ్ళ అప్పిరెడ్డి ఉన్నారు. బొత్స శాసనమండలిలో అడుగుపెడితే ఆ పదవి ఇవ్వడం ఖాయం. అదే జరిగితే వైసీపీలో బొత్స పట్టు కచ్చితంగా పెరుగుతుంది. అదే సమ యంలో కాంగ్రెస్ తో పాటు బిజెపి బొత్సను తమ వైపు తిప్పు కోవడానికి ప్రయత్నిస్తాయి. అప్పుడు వైసీపీని చీల్చడానికి అవ కాశం ఉంటుంది. ఈ కారణంగా నే బొత్స శాసనమండలిలో ప్రవే శానికి చంద్రబాబు స్కెచ్ వేసినట్లు విశ్లేషకులు అనుమానిస్తున్నారు. బొత్స సత్యనారాయణ జగన్ కంటే సీనియర్. ఉమ్మడి రాష్ట్రంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. ఒకానొక దశలో ముఖ్యమంత్రిగా ఆయన పేరు పరిశీలనకు వచ్చింది. రాష్ట్రస్థాయిలో ప్రభావం చూపాలన్నది బొత్స అభిమతం. కానీ గత ఐదేళ్లుగా పేరుకే మంత్రి కానీ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. పైగా కాంగ్రెస్ భావజాలం ఉన్న నేత. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతోంది. ఈ క్రమంలో ఆ పార్టీకి గుడ్ బై చెప్పిన పూర్వాశ్రమం నేతలు.. తిరిగి పార్టీ గూటికి చేరుతున్నారు. ఈ క్రమంలో బొత్సను దగ్గర చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. సరిగ్గా ఇదే సమయంలో బొత్సకు ఎమ్మెల్సీగా అప్ గ్రేడ్ చేయించారు చంద్రబాబు. తాను ఎమ్మెల్సీ కావడానికి సహకరించిన చంద్రబాబు టాస్కును బొత్స ఎలాగైనా పూర్తి చేస్తారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఆ 8 మంది ఎవరు...

విజయవాడ, ఆగస్టు 16 వైసీపీని వీడేందుకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారా? ఐదుగురు నుంచి 8 మంది వరకు పార్టీకి గుడ్ బై చెప్పనున్నారా? ఈ వార్తల్లో నిజం ఎంత? పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది.అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజకీయంగా పెను దుమారం రేపింది. అధికార విపక్షాల మధ్య గట్టి వాదనలే జరుగుతున్నాయి. ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనికి టిడిపి నేతలు కౌంటర్ ఇస్తున్నారు.ఈ క్రమంలో సీనియర్ మంత్రి కొల్లు రవీంద్ర ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు గేట్లు తెలిస్తే వైసీపీలో ఎమ్మెల్యేలు మిగలరని.. ఐదుగురు నుంచి 8 మంది వరకు టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారంతా టిడిపికి టచ్ లోకి వచ్చినట్లు చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో వైసీపీ గెలిచింది కేవలం 11 స్థానాలే. జగన్ తో పాటు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఆయన సోదరుడు ద్వారకానాథ్ రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి.. ఈ నలుగురే యాక్టివ్ గా ఉన్న నేతలు. పార్టీతో పాటు జగన్ అన్న విధేయత చూపేది ఈ ముగ్గురే. మిగతావారు అనామకులు. వారికి విధేయతతో అంత పని లేదు. అయితే ఇప్పటికిప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీలో చేరే ఉద్దేశంలో ఉన్నారా? కూటమిలో చేర్చుకునే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారా? అంటే మాత్రం సమాధానం దొరకని పరిస్థితి.కూటమి తరుపున 164 మంది గెలిచారు. ఒక్క టిడిపి తరఫున 135 మంది విజయం సాధించారు. ఇప్పటికే కూటమి ఎమ్మెల్యేలతో కిటకిటలాడుతోంది. వారికి నిధులు, విధులు సర్దుబాటు చేయడంలో ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతున్నాయి. మూడు పార్టీల మధ్య సమన్వయం కూడా ఇబ్బందికరంగా మారుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు వైసీపీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటారా? అన్న ప్రశ్న మాత్రం ఉత్పన్నమవుతోంది. అదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేల నుంచి ఆ స్థాయిలో సానుకూలత కూడా కనిపించడం లేదు. టిడిపి కూటమి నుంచి ప్రయత్నాలు కూడా జరగడం లేదు.శాసనసభలో అసలు వైసీపీ ఉనికి లేదు. ఈ సమయంలో ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేలను తీసుకుంటే ఏం చేస్తారు అన్న ప్రశ్న ఎదురవుతోంది. అయితే వైసీపీని గట్టిగా దెబ్బ తీయాలంటే ఆ పని చేయాలి. కానీ 2014లో 23 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నప్పుడు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు చంద్రబాబు. దానిపై విమర్శిస్తూనే జగన్ టిడిపికి చెందిన నలుగురిని లాగేసుకున్నారు. అప్పటికే వైసీపీకి 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నలుగురు అవసరం లేకున్నా జగన్ టిడిపిని దెబ్బ తీయాలని భావించారు. కానీ అదే ఇబ్బందికరంగా మారింది. ఎన్నికల్లో ప్రభావం చూపింది. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీ ఎమ్మెల్యేలను తీసుకునే సాహసం చేస్తారా?అన్నది చూడాలి.వైసీపీలో నమ్మకమైన ఎమ్మెల్యేలు ఆ నలుగురే ఉన్నారు. మిగతావారు వివిధ కారణాలతో గెలిచారు. ఇప్పటివరకు అయితే వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. జగన్ టికెట్ ఇచ్చారు కాబట్టి ఆయన వెంట నడవాలని భావిస్తున్నారు. అయితే వైసిపికి భవిష్యత్తు లేదని భావిస్తే మాత్రం వారు స్వచ్ఛందంగా కూటమి పార్టీల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతానికైతే చంద్రబాబు నుంచి వారిపై ఎలాంటి ఒత్తిడి ఉండదు. ఎందుకంటే 164 మంది బలం ఉండడం.. కూటమి కిటకిటలాడుతుండడంతో.. వైసీపీ నుంచి తీసుకుని ఏం చేస్తాంలే అన్న భావన టిడిపిలో ఉంది. పైగా ఎటువంటి చెడ్డపేరుకు అవకాశం ఇవ్వకూడదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే సీనియర్ మంత్రి అలా ప్రకటన చేసేసరికి మాత్రం రకరకాల ఊహాగానాలు రేగుతున్నాయి.

# ఉచిత ఇసుక.. ఆన్ లైన్ బుకింగ్



నెల్లూరు, ఆగస్టు 16 ఆంధ్రప్రదేశ్‌లో ఇసుకను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం దాన్ని మరింత పారదర్శకంగా ఇంటికి చేర్చేందుకు మరో విధానం అందుబాటులోకి తీసుకొచ్చింది. గనుల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు ఇందులో ఉన్న లోటుపాటు ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక బుకింగ్, ట్రాన్స్‌పోర్ట్, నిఘా వంటి అంశాలపై ఆరా తీశారు. దీనిపై కొన్ని సూచనలు చేశారు. గ్రామవార్డు సచివాలయాల్లో ఇసుకను ఉచితంగా బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అక్కడ బుకింగ్ చేసిన తర్వాత ఎప్పురవాణా అవుతుంది అన్న విషయం నేరుగా వినియోగదారులకే తెలుస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే ఇంటికి ఇసుకు చేరుతుందన్నారు. ఇలా ఇసుకను ఆన్లైన్‌లో బుకింగ్ చేయడం వల్ల బుకింగ్ సులభతరం అవుతుందని, రీచ్‌ల వద్ద రద్దీ కూడా ఉండబోదన్నారు. ప్రజలకు ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు ఎంపానల్‌మెంట్ ఇవ్వనున్నట్టు చెప్పారు. అప్పుడు ప్రభుత్వం గుర్తించిన వెహికల్స్ మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. ఇక్కడ వినియోగదారుల వద్ద సొంత వెహికల్ ఉంటే కూడా ఇసుక తీసుకెళ్లవచ్చని అన్నారు. ఇలా రవాణా చేసే సమయంలో జరిగే అక్రమాలు అరికట్టేందుకు ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీ ఎంక్వయిరీ జరగాలని చంద్రబాబు సూచించారు. ఇలా చేస్తే పారదర్శకత వస్తుందని నిజమైన వియోగదారులకే ఇసుక చేరుతుందన్నారు. రవాణా రేట్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఇసుకను బల్క్‌గా బుక్ చేసుకునేందుకు సపరేట్ ఆన్‌లైన్ విధానం తీసుకురావాలని అధికారులకు సూచించారు చంద్రబాబు. ఇలా బల్క్‌గా ఇసుక తీసుకెళ్లేవాళ్లు జీఎస్టీ, ప్రాజెక్టు వివరాలు, సైట్ వివరాలు అన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుందన్నారు. అలాంటి ప్రాజెక్టులను అధికారులు సందర్శించి వివరాలు నమోదు చేస్తారు.

# 117 జీవో రద్దు చేయాలి – యుటిఎఫ్

బద్వేలు,రాష్ట్రంలో అమలు జరిపిన 117 జీవో ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం నడలిపోతున్నదని దీని వలన ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయని పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని 117 జీవో రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డిని కోరారు.రాష్ట్ర సంఘం పిలుపుమేరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి నివాసంలో ఆమెను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ మేనేజ్మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా ఆపరిష్కృతంగా వున్నాయని,పెరిగిన పనిభారంతో బాటు సమస్యలు పరిష్కారంకాక ఉపాధ్యాయుల అసంతృప్తి తీవ్రస్థాయిలో ఉన్నదని క్రింది సమస్యలన్నిటికి తగిన పరిష్కారం చూపే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని కోరారు. ప్రధానంగా జిఓ 117 రద్దు చేసి జిఓ 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని,ప్రీప్రైమరితో బాటు 1 నుండి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని,రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు.హైస్కూలల్లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని,ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని,హైస్కూలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటర్ పైబడి దూరం నుండి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజన పథకం మెనూ సవరించాలని,మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్గ్రేడ్ చేసి ప్రమోషన్లు, బదిలీలు వెంటనే జరిపించాలని,పిఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని,సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేసి పిజిటిలకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించాలని తెలిపారు. ఎయిడెడ్ నుండి స్థానిక సంస్థలు మరియు ప్రభుత్వ పాఠశాలల్లో అబ్జర్బ్ అయిన ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాల ని,ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు తగు చర్యలు గైకొనాలని కోరారు.మినిమమ్ టైంస్కేల్ ఉపాధ్యాయులు మరియు సి ఆర్ ఎం టి ల సర్వీస్లను రెగ్యులరైజ్ చేయాలని,ప్లస్ టూ పాఠశాలల్లోని పిజిటి పోస్టుల కు ప్రమోషన్లు ఇవ్వాలని తెలిపారు.పాఠశాలలకు రావలసిన అన్ని రకాల గ్రాంట్లు మంజూరు చేయాలని,విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని,వేసవి సెలవులలో నాడు-నేడు, ప్లస్ టూ తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేయాలని కూడా తెలిపారు.పై సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి సహకారం అందించాలని కోరారు.కార్యక్రమంలో ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు కృష్ణారెడ్డి,మజ్జారి చెన్నకేశవులు కొండయ్య బత్తుల చంద్రశేఖర్ గోపీనాథ్ కరిముల్లా హిపాజతుల్లా వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రమ్య, సూర్యనారాయణల వివాహమునకు హాజరైన ఆర్యవైశ్య సంఘ సభ్యులు..



ఎమ్మిగనూరు ఆగష్టు 16 విభారె న్యూస్..వివాహ శుభాకాంక్షలు..చి॥సూర్యనారాయణ, రమ్య లు దంపతులుగా ఒకటైన శుభ సందర్భంలో ఆర్యవైశ్య సంఘం తరఫున వివాహ శుభాకాంక్షలును ఆర్యవైశ్య సంఘం వారు నూతన వధూవరులకు ఆశీర్వాద పంచరత్న పత్రాల పటములను అందజేసి వారిరువురిని ఆశీర్వదించారు. ఈ శుభ సందర్భంలో శ్రీరాం చంద్రమోహన్ దంపతులు (రామ స్టీల్ సెంటర్ )ఆర్యవైశ్య సంఘానికి 10,116/-లు, వీరి వీయ్యంకులు రాయచూరు జిల్లా మస్కి గ్రామ వాస్తవ్యులు అమరావతి చంద్రకాంత్ దంపతులు 15,116/-లు విరాళం ఇవ్వడం జరిగినది. ఆర్యవైశ్య కుల దేవత శ్రీ వాసవి మాత కృపా కటాక్షాలతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు,సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో హాయిగా జీవించాలని మనసారా కోరారు.

## ఆళ్లగడ్డ రూరల్ ఎస్సైగా హరిప్రసాద్ బాధ్యతలు..




ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 16 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ రూరల్ ఎస్సైగా హరి ప్రసాద్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన నరసింహులు అన్నమయ్య జిల్లా ఐరాల మండలానికి బదిలీ చేస్తూ నంద్యాల జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు రూరల్ ఎస్సై హరిప్రసాద్ పదవి బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్సై హరి ప్రసాద్ కు పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## సింహ సంక్రమణం సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు..




కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 16 విభారె న్యూస్... (17-08-2024,శనివారం)సింహ సంక్రమణం పురస్కరించుకొని శ్రీ సూర్యనారాయణ స్వామివారి మూలవిరాట్ కు ఉదయం 7-00 గంటలకు పురుష సూక్త విధానంతో అరుణ పారాయణ పూర్వక సుగంధ ద్రవ్య జలాభిషేకము నిర్వహించబడును.భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని సూర్యనారాయణ స్వామివారి అభిషేక జల తీర్థమును స్వీకరించి స్వామివారి కృపను పొందగలరు.గమనిక అభిషేక సంకల్పం కొరకు భక్తాదులు గోత్రనామములు నమోదు చేసుకోగలరు.అభిషేక సంకల్ప రుసుము-300 వివరములకు సంప్రదించగలరుజి. వినయ్ కుమార్ శర్మకృష్ణ యజుర్వేద పండితులుసెల్:8919495919 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777

# నీతి నిజాయితీకి మారుపేరుకోట్ల విజయభాస్కర రెడ్డి గారు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు

విభారే న్యూస్. ఆగస్టు 16. కర్నూలు ప్రతినిధి. నీతి నిజాయితీకి మారుపేరు స్వర్గీయ శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు ఆయన సేవలను కొనియాడారు. దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజి ముఖ్యమంత్రి శ్రీ కోట్ల విజయ భాస్కర రెడ్డి గారి 104 వ జయంతి వేడుకలను శుక్ర వారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు కార్యకర్తలు జిల్లా పార్టీ కార్యాలయంలో కోట్ల విజయ భాస్కర రెడ్డి చిత్ర పటమునకు మరియు కోట్ల సర్కిల్ నందలి కోట్ల కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాబురావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రగతి పథంలో ఎన్నో మైలురాళ్లు సాధించి, పల్లె పల్లెకు తాగునీరు- సాగునీరు అందించడమే కాకుండా రోడ్లు, గృహాలు, విద్య, వైద్య, ఆరోగ్యం ప్రాధాన్యత ఇచ్చి రైతులకు భూమి హక్కు పత్రములను ఇచ్చిన ముఖ్యమంత్రి భారతదేశంలో కోట్ల విజయభాస్కరరెడ్డి మొదటి వ్యక్తి అని తెలిపారు. పేదలకు రూ.1.90 పైసలకే కిలో బియ్యం పథకం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశపెట్టిన ఘనత కోట్లకే దక్కుతుందన్నారు. రైతులకు రూ.50/- లకే విద్యుత్ అందించడమే కాకుండా, బడుగు, బలహీన వర్గాలకు శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టి, మహిళల ఆత్మ గౌరవం కోసం ఏకంగా మద్యపానాన్ని నిషేధించి,





డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, కె.సి. కెనాల్, ఎల్.ఎల్.సి. ఆధునీకరణ పనులకు వందల కోట్ల రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. రెండు సార్లు జిల్లా పరిషత్ చైర్మన్ గా, ఐదు సార్లు శాసన సభ్యులుగా, ఒక సారి శాసనమండలి సభ్యులుగా, ఆరు సార్లు కర్నూలు లోకసభ సభ్యులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా, నాలుగు సార్లు కేంద్రమంత్రిగా సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కిందని బాబురావు గారు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కోఆర్డినేషన్ చైర్మన్ అనంతరత్నం, డిసిసి ఉపాధ్యక్షులు బి బతకన్న, డిసిసి ప్రధాన కార్యదర్శులు పోతుల శేఖర్, సయ్యద్ నవీద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముర్షిద్ షీర్ ఖాద్రి, డిసిసి కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం, యజస్ అహ్మద్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రజాక్, ఖాజాబాష, రంగస్వామి, మహిళా కాంగ్రెస్ కె వెంకటలక్ష్మి, మద్దమ్మ, నాగమ్మ, మొదలగు వారు పాల్గొన్నారు.

# ఐదేళ్ల లక్ష్యాలతో జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి

**లక్ష్యాలను సాధించే దిశగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి**
**జిల్లాలో పండించే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా**







విభారే న్యూస్ కర్నూలు, ప్రతినిధి. ఆగస్టు 16: ఐదేళ్ల లక్ష్యాలతో జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకుని, లక్ష్యాల సాధనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు..శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఐదేళ్ల విజన్ ప్లాన్ రూపకల్పనపై జిల్లా అధికారులతో నిర్వహించిన వర్క్ షాప్ లో జిల్లా కలెక్టర్ పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.. రెండు రోజుల పాటు ఈ వర్క్ షాప్ జరుగనుంది..45 శాఖల అధికారులు ఈ వర్క్ షాప్ లో పాల్గొననున్నారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు...పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాలు పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఆర్థికాభివృద్ధి రూ.47514 కోట్ల నుండి రూ.95,567 కోట్ల మేరకు పెరిగే విధంగా అభివృద్ధి వ్యూహాలను రచించాలన్నారు.. అలాగే తలసరి ఆదాయం రూ. 1,74,932 నుండి రూ. 3,51,852 లకు పెంచే విధంగా కీలకమైన శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం అయినందున జిల్లాలో రైతులు పండించే పంటలను మార్కెటింగ్ చేసే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.. హైదరాబాద్ నగరం మనకు దగ్గరగా ఉన్నందున మన జిల్లాలో పండించే ఉత్పత్తులను రైతులు నేరుగా అక్కడికే తీసుకెళ్లి అమ్ముకునే విధంగా టైఅప్ చేసే అంశంపై అలోచన చేయాలన్నారు.. కొన్ని జిల్లాల్లో రైతులకు కంపెనీలతో టైఅప్ ఉంటుందని, వారే నేరుగా వచ్చి రైతులకు నగదు అందజేసి పండించిన పంటను తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అలా మన జిల్లాలో కూడా మార్కెటింగ్ చేసేందుకు ఉన్న అవకాశాలపై అగ్రికల్చర్, హార్టికల్చర్, డిఆర్డిఎ, బ్యాంకింగ్, సహకార శాఖ అధికారులు అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. జిల్లాలో ఉన్న కూరగాయల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి ఒక పోర్టల్ ను రూపొందించాలని కలెక్టర్ జిల్లా ఇన్ఫర్మాటిక్ అధికారిని ఆదేశించారు.. ఈ పోర్టల్ లో జిల్లాలో పండించే ఉత్పత్తులు, ధరల వివరాలను ఉంచడం వల్ల ట్రేడర్స్ నేరుగా రైతుతో మాట్లాడి పంటను కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు.. పంట ఉత్పత్తుల వివరాలు ఆన్లైన్ లో ఉండడం వల్ల పెద్ద పెద్ద మార్ట్స్ నేరుగా రైతులను సంప్రదించి ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. అలాగే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు తెలిసేలా కూడా ఒక పోర్టల్ ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. టమోటా పండించే ప్రాంతాల్లో టమోటా నిల్వ చేసుకునేందుకు వీలుగా ఖీఐఎజ,ఓఎఆఊ పథకాల కింద రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా కోల్డ్ రూమ్ ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు..అలాగే బహుళ ప్రయోజన కేంద్రాలు నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి కేంద్రాలను అప్పగించాలని కలెక్టర్ సహకార,మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించి పాడి పరిశ్రమ అభివృద్ధి,పాల ఉత్పత్తుల తయారీ, పొట్టేళ్ల పెంపకం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు..మత్స్యశాఖకు సంబంధించి ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో సీడ్ పాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఫిష్ కల్చర్ పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారిని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 20వ తేది నాటికి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు..జీరో పావర్టీ, సోషల్, ఫిజికల్(న్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్, డెమోగ్రాఫిక్ మేనేజ్మెంట్, ఈజ్ ఆఫ్ లివింగ్ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను రూపొందించాలని జేసీ సూచించారు..సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, అసిస్టెంట్ డైరెక్టర్ భారతి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖర్ రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, డిసిఓ రామాంజనేయులు, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ అధికారి నారాయణమూర్తి, ఏపీఎంఐపి పిడి ఉమాదేవి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామల, ఎల్డిఎం రామచంద్రరావు, కేడీసీసీ బ్యాంకు సీఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగోడు ఎస్ ఎం సి చైర్మన్ అబ్దుల్ ఖాదర్ మరియు ఆంగ్లం ఉపాధ్యాయుడు ఎస్ అబ్దుల్ మొహిద్దిన్.. ఘన సత్కారం...

### వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం...

వెలుగోడు స్పోర్ట్స్ న్యూస్ :- నంద్యాల జిల్లా వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు నేనున్నానంటూ నిరంతరం పాఠశాలకు సేవలంది స్తున్నటువంటి దాతలను ఎస్.ఎం.సి. చైర్మన్ ఎస్.అబ్దుల్ ఖాదర్ మరియు ఆంగ్లము ఉపాధ్యాయుడు ఎస్. మొహిద్దిన్ పాఠశాల బృందం ఘనం గా సత్కరించారని పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు . అటు పాఠశాలకు ఇటు నిరుపేద క్రీడాకారులకు ఎల్లవేళలా నిరంత సేవలు అందిస్తున్నటువంటి దాతలను పాఠశాల బృందం ఈనెల 15న 78వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక డైరెక్టర్ సురేష్ నాయుడు మాట్లాడుతూ మి సేవలు నిరంతరం ఉండాలని కోరుతు పాఠశాల క్రీడావరణంలో చిరు సత్కరించామని ఫిజికల్ డైరెక్టర్ సురేష్ నాయుడు తెలిపారు ఈ కార్యక్రమంలో అహమ్మద్ హుస్సేన్. నరసింహులు . రామకృష్ణ. శేషశైన శర్మ. హుస్సేన్ అమ్మ. వెంకటేశ్వర్లు. ఫైజుల్ల పాఠశాల బృందం పాల్గొన్నారు.



## ఈరోజు శని త్రయోదశి సందర్భంగా శని భగవానునికి ప్రత్యేక పూజలు...

కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 16 విభారె న్యూస్....శని త్రయోదశి 17-08-2024. శనివారం త్రయోదశి సందర్భంగా శని భగవానునికి తైలాభిషేకాలు శని హోమాలు నవగ్రహ హోమం జరుగును. ఏలినాటి శని అర్ధష్టమశని జాతకంలో శని దోషాలు ఉన్నవారికి శని అనుగ్రహం కొరకు ఈ రోజున శని భగవానుని పూజించ వచ్చు శని సంపూర్ణ హోమం సమయం 10:30 గంట లకు శని తైలాభిషేకం : 200/-శని సహిత నవగ్రహ సంపూర్ణ హోమం 3500 /- వివం ాల కొరకు సంప్రదించండి ప్రహ్లాద శర్మ898580 6794దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు.. 8896123777



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190